సాక్షి అనంతపురం

బుధవారం । 27 । డిసెంబర్ । 2023



రమణీయం.. రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లెడుగుంటలో ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. 8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం

34.3°/ 14.2°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

28న ఉద్యోగ మేళా



అనంతపురం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), మాస్టర్‌మైండ్ డిగ్రీ కళాశాల (అనంతపురం) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అధికారి ఎల్.ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. హెటిరోక్లబ్, ఫ్లిప్‌కార్ట్, ఎస్‌బిఎస్ ఇండియా, కాలిబెర్, అపోలో ఫార్మసీస్, ఆస్ట్రో స్టీల్స్, రిలయన్స్ నిప్పో లైఫ్ ఇన్సూరెన్స్, పవర్ గ్రూప్ సర్వీసెస్, నవభారత్ ఫర్టిలైజర్స్, శ్రీజ మిల్క్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల దాకా జీతాలు ఉంటాయని తెలిపారు. అనంతపురం, బెంగళూరు, హైదరాబాద్, హిందూపురంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు బయోడేటాతో పాటు ఆధార్, విద్యార్హత పత్రాలు తీసుకుని ఉదయం 9 గంటలకు అనంతపురంలోని మాస్టర్‌మైండ్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాకు హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు www.apssdc.in లింక్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు 83175 20929, 70754 68111 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎంఎల్‌హెచ్‌పీలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కార్పొరేషన్: కడప జోన్ 4 పరిధిలోని 32 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్/ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌డీ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఉద్యోగ వివరాలు, దరఖాస్తు https://hmfw.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వచ్చే నెల 12వ తేదీలోపు దరఖాస్తులను కడప ఆర్‌డీ కార్యాలయానికి పంపాలని సూచించారు.

కుష్టు వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ

అనంతపురం కార్పొరేషన్: ప్రారంభ దశలోనే కుష్టు వ్యాధిని గుర్తించి, సరైన చికిత్స అందిస్తే అంగవైకల్యం బారిన పడకుండా ఉంటారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. బుధవారం నుంచి జనవరి 12న జరిగే కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. కుష్టు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వ్యాధి ఏ దశలో ఉన్నా... మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. ఈ విషయంపై ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుజాత, వైద్యులు డాక్టర్ గంగాధర్‌రెడ్డి, పీఎంఓ నాగన్న, డిప్యూటీ డెమో త్యాగరాజు, హెచ్‌ఈఓ సత్యనారాయణ, డీపీఎంఓ సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లికి విద్యుదాఘాతం.. తనయుడు ఆత్మహత్య



మృతుడు నరసింహులు

బత్తలపల్లి: ప్రేమగా చూసుకునే తల్లి విద్యుదాఘాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా..ఆమెకు ఏమవుతుందోనని ఆందోళన చెందిన కుమారుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం పత్యాపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...పత్యాపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్దకుమారునికి వివాహం కాగా, చిన్న కుమారుడు నరసింహులు (18) తల్లిదండ్రులతో ఉంటూ వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే వాడు. మూడు రోజుల క్రితం లక్ష్మీదేవి తోటలోని పశువుల షెడ్డులో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. దీంతో కుటుంబీకులు ఆమెను అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేయిస్తున్నారు. ఎంతగానో ప్రేమించే తల్లి ఆస్పత్రి బెడ్‌పై ఉండటాన్ని చూసి నరసింహులు జీర్ణించుకోలేకపోయాడు. తల్లికి ఏమవుతుందోనని భయపడేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం పశువులు కట్టేసిన షెడ్డులోకి వెళ్లిన నరసింహులు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై తండ్రి ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.







అనంతపురంలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా జ్యోతిని క్రీడాకారిణికి అందజేస్తున్న కలెక్టర్ గౌతమి. చిత్రంలో ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పీటీసీ మైదానంలో వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు, వీక్షిస్తున్న విద్యార్థులు

ఉప్పొంగిన క్రీడోత్సాహం

- అట్టహాసంగా 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభం
- 47 రోజులపాటు సాగే అతి పెద్ద టోర్నీ
- అనంత'కు కీర్తి ప్రతిష్టలు తేవాలి
- క్రీడాకారులకు అధికారులు, ప్రజాప్రతినిధుల పిలుపు

క్రీడోత్సాహం ఉప్పొంగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా'కు కనీవినీ ఎరుగని స్థాయిలో స్పందన లభించింది. ఐదు దశల్లో 47 రోజులపాటు సాగే క్రీడల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని ప్రతిభాపాటవాలు ప్రదర్శించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.



అనంతపురంలో కబడ్డీ పోటీల్లో కీలక సన్నివేశం



అనంతపురంలోని పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో మంగళవారం రసవత్తరంగా సాగుతున్న అమ్మాయిల ఖోఖో పోటీలు

అనంతపురం: ఆడుదాం ఆంధ్రా–2023 క్రీడా సంబరాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అనంతపురంలోని పోలీసు శిక్షణ కళాశాల (పీటీసీ) మైదానంలో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, మేయర్ వసీం క్రీడా పతాకాలను ప్రారంభించి జాతీయ గీతాలాపన చేశారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి, బెలూన్లను గాల్లోకి ఎగురవేసి టోర్నీని లాంఛనంగా ప్రారంభించారు. గౌరవ వందనం అనంతరం క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్ బ్యాటింగ్ చేసి, వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. తర్వాత క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు మొదలయ్యాయి. క్రీడాకారులను పరిచయం చేసుకుని బాగా ఆడి దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇదే వేదికపై నుంచి అంతర్జాతీయ క్రీడాకారులు విశ్వనాథ చౌదరి, జి.రాజేశ్వరిలకు శాలువా కప్పి సన్మానించారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ మెగా టోర్నీలో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచి పతకాలతో జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు.

క్రీడా ఆణిముత్యాలను అందిద్దాం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడా ఆణిముత్యాలను దేశానికి అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన విప్లవాత్మక కార్యక్రమమే 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరమని కలెక్టర్ గౌతమి అన్నారు. ఫిబ్రవరి 10 వరకు 47 రోజులపాటు పట్టణ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. 15 ఏళ్లు పైబడిన వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనదలచుకున్న క్రీడాకారుల కోసం 24/7 – స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు, మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ల పర్యవేక్షణలో ఆట స్థలాలు గుర్తించామన్నారు. ఐదు రకాల క్రీడలకు సంబంధించిన పరికరాలను సచివాలయాల వారీగా పంపిణీ చేశామన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలన్నారు. జిల్లాలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారన్నారు.

అతిపెద్ద క్రీడా సంబరం

రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద క్రీడా సంబరం 'ఆడుదాం ఆంధ్రా' అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అభివర్ణించారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి మెగా టోర్నీ నిర్వహించడం సంతోషదాయకమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతకు ఈ క్రీడా సంబరమే ఒక నిదర్శనమని ప్రశంసించారు. గ్రామ, వార్డు సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఐదు రకాల క్రీడా పోటీలు జరుగుతున్నాయన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నారు. యువత పెడదోవ పట్టకుండా క్రీడా పోటీల్లో పాల్గొనేలా, దేశ, ప్రపంచ వేదికల్లో అవకాశం దక్కేలా క్రీడా పోటీలు దోహదపడతాయన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ క్రీడల ద్వారా మేధో సంపత్తి పెంపొందించేందుకు వీలు కలుగుతుందన్నారు. క్రీడాకారులు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, నగరపాలక డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, డీఈఓ నాగరాజు, కార్పొరేటర్ సుశీలమ్మ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా పాల్గొన్నారు.





అనంతపురంలో సీనియర్ క్రీడాకారులకు సన్మానం, రాయదుర్గంలో మ్యాచ్ ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

అంతటా క్రీడా సందడి

జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. 663 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 323 క్రీడా మైదానాల్లో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు ప్రారంభమయ్యాయి. మొత్తం 1,33,670 మంది క్రీడాకారులు ఇందులో భాగస్వాములయ్యారు.

- రాయదుర్గం హైస్కూల్ క్రీడా మైదానంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డిలతో కలిసి క్రీడా పోటీలను ప్రారంభించారు. విప్ కాపు బ్యాటింగ్ చేయగా, కమిషనర్ బౌలింగ్ వేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.
- శింగనమల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభించారు. ఎమ్మెల్యే కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. గతంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు గోవర్ధన్‌రెడ్డి, కార్తీక్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, ఎంపీపీ యోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.
- కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ఆర్డీఓ డాక్టర్ రాణీ సుస్మిత, మునిసిపల్ కమిషనర్ వెంకటేశులు, ఈఓఆర్డీ బాలాజీ, ఎంపీపీ మారుతమ్మ, మునిసిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి ప్రారంభించారు.
- గుంతకల్లులోని రైల్వే క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి బ్యాటింగ్ చేయగా, మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున బౌలింగ్ చేసి పోటీలను ప్రారంభించారు.
- తాడిపత్రి మండలం పెద్దపొలమడ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు ప్రతిభ చాటుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెగా టోర్నీ నిర్వహించడం గొప్ప విషయమన్నారు.
- రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని అనంతపురం రూరల్ మండలం చియ్యేడులో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడలతో మానసిక వికాసం కలగడంతో పాటు సోదరభావం పెంపొందుతుందన్నారు.









చియ్యేడులో వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, గుంతకల్లులో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, తాడిపత్రి మండలం పెద్దపొలమడలో బ్యాట్ పట్టిన ఎమ్మెల్యే పెద్దారెడ్డి, శింగనమలలో వాలీబాల్ మ్యాచ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

పైన గాంభీర్యం.. లోన భయం

- టీడీపీ పుట్టి ముంచనున్న వర్గ విభేదాలు
- ప్రతి నియోజకవర్గంలోనూ ఆధిపత్య పోరు
- గెలవలేకపోయినా ఓడిస్తామంటూ పరస్పర సవాళ్లు
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ పచ్చ పార్టీ అధిష్టానానికి వణుకు
- గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రతిపక్ష పార్టీగా ఘోరంగా విఫలమైందన్న విమర్శలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నట్టు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పైన పటారం, లోన భయం భయంగా ఉందనేది కొంతమంది ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. 2019 శాసనసభ ఎన్నికల్లో టీడీపీ తరఫున ఇద్దరు అభ్యర్థులు మాత్రమే ఉమ్మడి అనంతపురం జిల్లాలో గెలిచారు. మిగతా 12 చోట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. టీడీపీ తరఫున గెలిచిన బాలకృష్ణ, పయ్యావుల కేశవ్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండరన్నది ప్రధాన విమర్శ. మిగతా ఇన్‌చార్జ్‌లున్న చోట గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రజల పక్షాన నిలబడి ఏ కార్యక్రమమూ చేయలేదు. దీనికి తోడు నియోజకవర్గాల్లో ఉన్న తగాదాలు ఇప్పుడా పార్టీకి పెద్ద తలనొప్పిగా మారాయి. నేను గెలవలేక పోవచ్చు.. కానీ నిన్ను ఓడించగలను అంటూ ఒకరికొకరు సవాళ్లు విసురుకుంటున్నారు.



అప్పుడు చేసింది లేదు.. ఇప్పుడు చేయాల్సిందీ లేదు

టీడీపీ అధికారంలో ఉండగా జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఒక్క అభివృద్ధి పనీ చెయ్యలేదు. అందుకే పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులును ప్రజలు గత ఎన్నికల్లో చిత్తుగా ఓడించారు. ఈ పరిస్థితుల్లో కనీసం ప్రతిపక్ష పార్టీ పాత్ర అయినా పోషించాల్సింది పోయి బురద రాజకీయం చేస్తుండటంతో జిల్లాలో తెలుగుదేశం పార్టీని జనం పెద్దగా పట్టించుకోవడం లేదు. పైగా ప్రభుత్వం తరఫున అందాల్సిన సంక్షేమ ఫలాలన్నీ తెలుగుదేశం పార్టీ వర్గాలకు కూడా చేరుతున్నాయి. అందుకే లోకేష్ యువగళానికి, బాబు జైలుకెళ్లినప్పుడు చేసిన నిరసనలకు ఉమ్మడి జిల్లాలో నామమాత్రంగానైనా స్పందన లేదు. దీంతో ఇప్పుడు టీడీపీ నేతల్లో భయం పట్టుకుంది.

నువ్వెంతంటే నువ్వెంత..

కళ్యాణదుర్గంలో హనుమంతరాయ చౌదరి, ఉమామహేశ్వర నాయుడు మధ్య నాలుగేళ్లుగా విభేదాలు కార్చిచ్చులా రగులుతూనే ఉన్నాయి. ఇక్కడ పార్టీ పరిస్థితి దారుణంగా ఉంది. పెనుకొండ నియోజకవర్గంలోనూ బీకే పార్థసారథి, సవితమ్మ మధ్య కోల్డ్‌వార్ నడుస్తూనే ఉంది. ఇక కదిరిలో వైఎస్సార్‌సీపీ తరఫున 2014లో గెలిచి టీడీపీలోకి వెళ్లిన అత్తార్ చాంద్‌బాషా, చెక్‌బౌన్స్ కేసుల్లో శిక్షపడిన కందికుంట ప్రసాద్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. శింగనమలలో బండారు శ్రావణిశ్రీకి టికెట్ దక్కకుండా చేసేందుకు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ప్రయత్నాలు సాగిస్తున్నారు. టీడీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కాలవ శ్రీనివాసులు అంటే ఏ నియోజకవర్గ నేతలకూ పడడం లేదు. ఈ దఫా ఆయనకు ఎమ్మెల్యే టికెట్ దక్కుతుందో లేదోనన్న అనుమానం ఉంది. అనంతపురం అర్బన్‌లో ప్రభాకర్ చౌదరికి చెక్‌పెట్టేందుకు పలువురు గ్రూపుగా ఏర్పడ్డారు. గుంతకల్లులో టీడీపీ అభ్యర్థి ఊసే లేకపోగా, మడకశిరలో రెండు వర్గాల మధ్య నిరంతరం పోరు కొనసాగుతోంది. తాడిపత్రిలో జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరుతో ప్రజలు విసుగెత్తారు. గతంలో టీడీపీలో ఉండి ఓటమిపాలై బీజేపీలో చేరిన వరదాపురం సూరి.. ధర్మవరం టికెట్ కోసం ఇప్పుడు మళ్లీ టీడీపీ కండువా వేసుకోవాలని చూస్తుండగా.. పరిటాల శ్రీరాం వ్యతిరేకిస్తున్నారు. ఇలా ప్రతి నియోజకవర్గంలో గ్రూపు తగాదాలతో పార్టీ పరిస్థితి దారుణంగా ఉంది. ఈ పరిస్థితి తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి ముచ్చెమటలు పట్టిస్తోంది.

వైభవంగా నీలకంఠేశ్వరుడి రథోత్సవం

- ఏపీ, కర్ణాటక భక్తులతో పోటెత్తిన డీ హీరేహాళ్
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు(ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో నీలకంఠేశ్వరుడి మూలవిరాట్

రాయదుర్గం(డి హీరేహాళ్): డి.హీరేహాళ్‌లో ప్రసిద్ధి చెందిన నీలకంఠేశ్వరుడి రథోత్సవం మంగళవారం కనుల పండువగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో డి.హీరేహాళ్ జనసంద్రమైంది. నందికోలు నాట్యం, చెక్కభజన, కోలాటం, బొమ్మల ప్రదర్శనతో కళాకారులు ఆకట్టుకున్నారు. ఆలయంలో వేకువజామునే విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు పెద్ద ఎత్తున జరిగాయి. తొలత మడితేరు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వామి ఉత్సవ మూర్తిని పల్లకీలో తీసుకొచ్చి రథంపై అధిష్ఠింపజేసి హర నామస్మరణతో ముందుకు లాగారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీపీ పవిత్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజరాజు నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, మైనార్టీ నాయకులు రహంతుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, సింగాడి జగదీష్, సింగాడి మంజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పామిడి: ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి కిందపడి గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. స్థానిక మడికట్ల ఆంజనేయస్వామి వీధికి చెందిన బెస్త రామాంజనేయులు(36) మూడు రోజుల క్రితం చెట్టు మీద నుంచి కింద పడి గాయపడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జోయి జోడే కుమార్, వైస్ కన్వీనర్ శివారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి తదితరులు ఆస్పత్రిలోని మార్చురీలో ఉన్న రామాంజనేయులు మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య


మోహన్ (ఫైల్)

శెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లికి బోయ మోహన్(41) ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడితో కలసి జీవనం సాగిస్తున్న మోహన్... కుటుంబపోషణ, ఇతర అవసరాలకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక మంగళ వారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆవరణలో ఉన్న కొట్టంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాంభూపాల్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

యువకుడి బలవన్మరణం

పుట్టపర్తి అర్బన్: తరచూ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఓ యువకుడు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం పెడపల్లికి చెందిన కంసల నాగేంద్రాచారి, పద్మావతి దంపతులకు కుమారుడు సంతోష్‌కుమార్(21), ఓ కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేసి అత్తారింటికి పంపారు. సంతోష్ కార్పెంటరీ పనులతో కుటుంబానికి అండగా నిలిచాడు. అప్పుడప్పుడు కడుపునొప్పితో బాధపడుతుండే సంతోష్.... ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో చికిత్స చేయించుకోలేక మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం తల్లి అనంతపురానికి వెళ్లింది. మంగళవారం ఉదయం కూలి పనిపై తండ్రి పక్క గ్రామానికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సంతోష్ కుమార్... కడుపునొప్పి తాళలేక ఇంటి పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం సంతోష్ అవ్వ అక్కడకు చేరుకుని తలుపు తోసి చూడడంతో విగతజీవిగా వేలాడుతున్న మనవడు కనిపించడంతో కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రసాద్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రమణీయం.. రథోత్సవం

- కనుల పండువగా జిల్లేడుగుంట ఆంజనేయస్వామి రథోత్సవం
- తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి భారీగా హాజరైన భక్తజనం
- నేడు జ్యోతులు, భూతప్ప ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



ఉత్సవ విగ్రహాలను రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తదితరులు, రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మడకశిర రూరల్: జై భజరంగ భళీ.. పవన పుత్రా పాహిమాం..రామదూత నమోనమః..అంటూ భక్తుల జయజయ ధ్వానాల మధ్య హనుమంతుడి రథోత్సవం రమణీయంగా సాగింది. భక్తరపల్లి లక్ష్మీ నరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లెడుగుంటలో ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రథోత్సవంలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

హోమంతో ఉత్సవం ప్రారంభం

తొలుత ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను భక్తులు గోవింద నామస్మరణ మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చారు. పురోహితులు హోమం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి వేలాది మంది భక్తులతో కలిసి రథం లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఆ వెంటనే భక్తులు బొరుగులు, అరటిపండ్లు రథంపై విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. రథం వద్ద ప్రసాదం తీసుకోవడానికి, స్వామికి కొబ్బరి కాయలు సమర్పించేందుకు ఉత్సాహం చూపారు. అనంతరం రథోత్స అనంతరం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు. అంతకుముందు దేవదాయశాఖ అధికారులు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, దేవదాయ శాఖ అధికారులు, రథోత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు జ్యోతులు, భూతప్ప ఉత్సవాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం జ్యోతులు, భూతప్ప ఉత్సవాలు జరుగును న్నాయి. ఈ ఉత్సవాల్లో భూతప్పలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. సంతానం లేని మహిళలు, వివిధ వ్యాధులతో బాధపడుతున్నవారు.. మడిస్నానం చేసి భూతప్పలు వచ్చే దారిలో పడుకుంటారు. భూతప్ప వారిపై కాలుమోపితే రోగాలు నయం అవుతాయని, సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఆంధ్ర, కర్ణాటకతో పాటు తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. భారీగా తరలివచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని దేవదాయ శాఖ, రథోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భూతప్ప, జ్యోతుల ఉత్సవాల సందర్భంగా మొత్తం 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ సురేష్‌బాబు తెలిపారు. అదే విధంగా భక్తుల సౌకర్యార్థం మడకశిర ఆర్టీసీ డిపో నుంచి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి 22కి పైగా బస్సులు నడుపుతున్నారు.

పోటీ పరీక్షలకు 'సూపర్–60' శిక్షణ


కరపత్రాలు విడుదల చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి వార్షిక పరీక్షల తర్వాత ఉన్నత విద్య కోసం జరిగే సెట్ పరీక్షలకు అభయ పౌండేషన్, నిస్వార్థ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ నాగరాజు తెలిపారు. ఆర్టీటీ సెట్, పాలీ సెట్, ఏపీఆర్‌జేసీ, ఏపీఎంజేపీ, ఏపీఎస్‌డబ్ల్యూజేసీ, పుట్టపర్తి శ్రీసత్యసాయి కళాశాలల ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, బైజూస్ ట్యాబ్‌ల జిల్లా నోడల్ అధికారి ఓబుళరెడ్డి తదితరులతో కలసి ఆయన విడుదల చేసి, మాట్లాడారు. అభయ, నిస్వార్థ ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభుత్వ, జెడ్పీ, ఏపీఎంఎస్, మునిసిపల్, కేజీబీవీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిభ ఆధారంగా అనంతపురం జిల్లాలో 30 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 30 మందిని ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. శిక్షణతో పాటు క్రమశిక్షణ, విలువలు, ఆరోగ్యం, యోగా, ఆటలు, క్షేత్రపర్యటనలు, కర్మయోగ, నిజ జీవిత విజయగాథలపై అవగాహన కల్పిస్తామన్నారు.

మందలించారని ఇంటి నుంచి ఉడాయింపు


విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ షణ్ముఖానందరెడ్డి

ధర్మవరం అర్బన్: కాలేజీకి డుమ్మా కొట్టి చక్కర్లు కొడుతున్న ఓ విద్యార్థిని పోలీసులు గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాలు... కనగానపల్లి గ్రామానికి చెందిన ఓబులేసు కుమారుడు గుజ్జల మహేష్ ధర్మవరంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో తరచూ కళాశాలకు డుమ్మా కొడుతుండడం గమనించిన తండ్రి మంగళవారం తీవ్ర స్థాయిలో మందలించాడు. సక్రమంగా కాలేజీకి వెళ్లి చదువుకుని బాగుపడాలని హితవు పలికాడు. ఈ అంశం నచ్చని మహేష్ కాలేజీకి వెళుతున్న ఇంట్లో చెప్పి ధర్మవరానికి చేరుకున్నాడు. అయితే కాలేజీకి వెళ్లకుండా పట్టణంలోని వీధుల్లో చక్కర్లు కొడుతూ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. విద్యార్థి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో రైల్వే పోలీసులు గుర్తించి ఆరా తీశారు. ఇంటి నుంచి వచ్చేసినట్లు తెలపడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి రప్పించుకున్నారు. విషయం తెలుసుకున్న అనంతరం విద్యార్థికి కౌన్సిలింగ్ ఇచ్చి బుద్ధిగా చదువుకోవాలంటూ తల్లిదండ్రులకు అప్పగించారు.

'కాలవా.. నోరు అదుపులో పెట్టుకో'


మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: తనపై ఆరోపణలు చేస్తున్నప్పుడు కాస్త నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులును ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హెచ్చరించారు. మంగళవారం అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయదుర్గానికి వలస వచ్చిన కాలవ చుట్టపు చూపుగా ఆ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారన్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన కాలవ.. దాహార్తితో అల్లాడుతున్న గ్రామాలకు నీరిచ్చే ప్రయత్నం కూడా చేయలేదని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడి రూ.40 కోట్లు నిధులు మంజూరు చేయించుకుని ప్రజల దాహార్తి తీర్చే పనులు చేపట్టానన్నారు. నెల రోజుల్లోపు అన్ని గ్రామాలకు నీరిచ్చే ఏర్పాటు చేసినట్లు వివరించారు. వివిధ గ్రామాల్లోని 58 చెరువులనూ నీటితో నింపనున్నట్లు పేర్కొన్నారు. తారురోడ్డు అంటే తెలియని దాదాపు 30 గ్రామాలకు తన హయాంలో రోడ్లు వేయించానన్నారు. తాను అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే రెండేళ్లపాటు కరోనా ప్రభావం తీవ్రంగా ఉందని, ఆ తర్వాత రెండేళ్లలో ఏ ఎమ్మెల్యే కూడా చేయనంత అభివృద్ధిని చేసి చూపించానన్నారు.

రూ.360 కోట్లు కొల్లగొట్టావు

అధికారంలో ఉన్నప్పుడు కాలవ ఇసుక దందాలో రూ.360 కోట్లు కొల్లగొట్టాడని, ఇదే విషయమై అప్పట్లో ఆయన అనుకూల పత్రికల్లోనే పతాక శీర్షికలో కథనాలు ప్రచురితమయ్యాయని కాపు గుర్తు చేశారు. తవ్వేకొద్దీ కాలవ అవినీతి బయటపడుతూనే ఉంటుందన్నారు. కణేకల్లు చెరువులో పూడికతీత పనుల్లో రూ.2కోట్ల నిధులు దోచేశారన్నారు. ఎప్పుడూ తనపై ఆరోపణలు చేయడం కాకుండా ప్రజలకు ఆయన చేసిన మంచి ఏమిటో చెప్పుకోలేని పరిస్థితి కాలవదన్నారు. 'ఆయన అధికారంలో ఉన్నప్పుడు పనులు చక్కబెట్టకుండా ఆయన తర్వాత అధికారం చేపట్టిన నాపై నిందలు మోపడం ఎంత వరకు సమంజసం' అని ప్రశ్నించారు. 15 ఏళ్ల పాటు రాయదుర్గానికి టీడీపీ వారే ఎమ్మెల్యేలుగా ఉన్నా నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఈ రోజు ఏ ఊరికి వెళ్లినా తాను వేసిన రోడ్లే కనబడుతున్నాయన్నారు. రూ.45 కోట్లతో రహదారులు వేయించామన్నారు.

అంతా మోసమే

అనంతపురం నుంచి రాయదుర్గం వరకూ జాతీయ రహదారిని తానే వేశానని కాలవ గొప్పలు చెబుతున్నాడని, ఈ అంశంతో ఆయనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కాలవ అధికారంలో ఉన్నప్పుడు పంచాయతీలు, మున్సిపాలిటీలకు సంబంధించి విద్యుత్ బిల్లుల బకాయి రూ.40 కోట్లు పేరుకుపోయిందన్నారు. అన్ని కులాలకు కల్యాణ మంటపాలు కట్టిస్తామంటూ నమ్మబలికి కేవలం శిలాఫలకాలు మాత్రమే వేశారన్నారు. కణేకల్లు మండలం నాగేపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో బోరు వేసినట్లు గొప్పలకు పోయారని, అక్కడికెళ్లి చూస్తే ఆ బోరు కనిపించదన్నారు. ప్రతి కులాన్ని మోసం చేసి పబ్బం గడుపుతున్న కాలవకు రాజకీయ సమాధి కట్టేందుకు నియోజక వర్గ ప్రజలు కాచుకుని ఉన్నారన్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో తన దగ్గర ఉందని, అందులో పొందుపరిచిన ఏ ఒక్క హామీని అధికారంలో ఉన్నప్పుడు నెరవేర్చలేకపోయారని గుర్తు చేశారు. ఇటీవలే ఆ మేనిఫెస్టోను కాలవకు, చంద్రబాబుకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపి నిలదీశానన్నారు. సిగ్గులజ్జా ఏమైనా ఉంటే ఆ మేనిఫెస్టోను ఒకసారి చదివి ప్రజలను ఎలా దగా చేశారో తెలుసుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జనవాక్కు

సొంతింటి కల నెరవేరింది



కూలి పనులతో జీవనం సాగిస్తున్న మాకు సొంతిల్లు అనేది ఓ కలగానే ఉండిపోయింది. గత ప్రభుత్వం మా బతుకుల గురించి పట్టించుకోలేదు. సొంతిల్లు కోసం ఇచ్చిన దరఖాస్తులను చెత్త కుప్పల పాలు చేశారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత మాకు రూ.లక్షల విలువ చేసే ఇంటి స్థలంతో పాటు సొంతిల్లు మంజూరు చేశారు. మరో 20 రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తి కానుంది. జగనన్న తోనే మా సొంతిల్లు కల నెరవేరింది. సీఎం జగనన్న సాయం మరువలేం. మళ్లీ ఆయనే సీఎం కావాలని దేవుడిని కోరుకుంటున్నాం.

– రామాంజినమ్మ, యర్రగుంట, కణేకల్లు మండలం

అన్ని పథకాల లబ్ధి పొందాను



గతంలో ఎన్నడూ లేనంతగా వైఎస్ జగన్ ప్రభుత్వంలో అన్ని రకాల సంక్షేమ పథకాల లబ్ధి పొందాను. అమ్మ ఒడి పథకంతో పిల్లల చదువులకు సంబంధించిన బెంగ తీరింది. వాళ్లు చక్కగా చదువుకుంటున్నారు. గృహ నిర్మాణ పథకం కింద సొంతిల్లు నిర్మించుకున్నా. సీఎం జగన్ పాలన ఎంతో బాగుంది. ఆయన రుణం తీర్చుకోలేనిది. మళ్లీ ముఖ్యమంత్రిగా ఆయనే రావాలని కోరుకుంటున్నాం.

– జిలేఖ, ఉదిరిపికొండ, కూడేరు మండలం

జగనన్న వెంటే మేమంతా



సంక్షేమ పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటే మేమంతా ఉంటాం. గత టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై తీవ్ర నిర్లక్ష్యం చేసింది. మౌలిక వసతులు లేక పిల్లలు నానా ఇబ్బందులు పడ్డారు. బాలికలకు మరుగుదొడ్లు లేక నానా పాట్లు పడ్డారు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే ప్రభుత్వ పాఠశాలలు బాగుపడ్డాయి. ఒకప్పుడు బడికి వెళ్లమంటే మొరాయించే పిల్లలు... ఇప్పుడు మేము చెప్పకనే బడికి రెడీ అయి పోతున్నారు. నా ఇద్దరు పిల్లలూ ఇంగ్లిష్ చదువులు చదువుతుంటే ఎంతో ఆనందంగా ఉంది. పిల్లల బతుకులు బాగుపడుతున్నాయంటే ఇంత కన్నా మాకేమి కావాలి.

– డి.లక్ష్మీసావిత్రి, భీమరాయునిపేట, తాడిమర్రి మండలం

పింఛన్ ఇచ్చి ఆదుకున్నాడు



గత ప్రభుత్వంలో పింఛన్ కోసం నానా కష్టాలు పడ్డాను. అయినా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక నాకు పింఛన్ మంజూరైంది. నా పెద్ద కొడుకులా ఆదుకున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నాడు. మా లాంటి ముసలోళ్లకు ఇంతకన్నా ఏమి కావాలి. వైఎస్ జగన్ లాంటి వ్యక్తి పదికాలాల పాటు సీఎంగా ఉంటేనే మాలాంటి పేదలు సంతోషంగా జీవిస్తారు.

– గంగమ్మ, ఎస్సీ కాలనీ, పాల్తూరు, విడపనకల్లు మండలం

పట్టపగలే నగదు అపహరణ


ఘటన తీరును వివరిస్తున్న బాధితుడు నాగేశ్వరరావు

గుత్తి: పట్టపగలే ఓ వ్యక్తి నుంచి రూ.1.60 లక్షల నగదును దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం మామిళ్లపల్లికి చెందిన నాగేశ్వరావు మంగళవారం ఉదయం గుత్తిలోని కెనరాబ్యాంక్‌లో 5 తులాల బంగారు నగలు కుదవబెట్టి రూ.1.60 లక్షలు తీసుకున్నాడు. ఆ డబ్బును తన బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టి బస్టాండ్ సమీపంలోని ఓ ఫర్టిలైజర్స్ షాపు వద్దకు చేరుకోగానే తన ఊరి వాళ్లు కనిపించడంతో వారితో మాటామంతీ కలిపాడు. అదే సమయంలో రెండు స్పోర్ట్స్ బైక్‌ల్లో వచ్చిన నలుగురు దుండగులు రూ.100, రూ.50 నోట్లను నాగేశ్వరరావు నిల్చొన్న ప్రాంతంలో పడేసి, ఆయన దృష్టి ఏమార్చారు. ఆ డబ్బు తీసుకునేందుకు నాగేశ్వరరావు కిందకు వంగినప్పుడు అతని బైక్ ట్యాంక్ కవర్‌లో ఉన్న నగదు తీసుకుని ఉడాయించారు. స్థానికులు వెంట పడ్డా చిక్కలేదు. ఘటనపై నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు సీఐ వెంకటరామిరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జీఆర్పీ అదుపులో ఖాకీలు!

- ఏడాదిన్నరగా బ్యాగ్ లిఫ్టింగ్
- ఇద్దరు కానిస్టేబుళ్ల పట్టివేత
- రెండు కిలోలకు పైగా బంగారం, 25 ఐ ఫోన్లు, 30కి పైగా ట్యాబ్‌లు స్వాధీనం!


కానిస్టేబుళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, పర్సులు, ట్యాబ్‌లు, ఐఫోన్లు

అనంతపురం క్రైం: ప్రయాణికులకు రక్షణ కల్పించాల్సిన ఇద్దరు కానిస్టేబుళ్లు దొంగలుగా మారారు. ఏడాదిన్నర కాలంగా రైలు ప్రయాణికులను ఏమార్చి వారి బ్యాగులను కొల్లగొట్టారు. వీరి వ్యవహారంపై అనుమానం వచ్చిన గుంతకల్లు రైల్వే పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టి పక్కా ఆధారాలతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నమ్మలేని నిజాలు వెలుగులోకొచ్చాయి. కిలోల కొద్దీ బంగారంతో పాటు పదుల సంఖ్యలో ఐఫోన్లు, ట్యాబ్‌లు స్వాధీనం చేసుకున్నారు? ఇంతకాలం రైళ్లలో జరిగిన చోరీలకు ఇద్దరు ఖాకీలే కారకులని తెలుసుకున్న రైల్వే పోలీసులు వారి వద్ద నుంచి చోరీ సొత్తును రికవరీ చేసే పనిలో పడ్డారు. ఈ వ్యవహారంపై అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు...

మూడు రోజుల క్రితమే అదుపులోకి

కర్నూలు జిల్లా, తుగ్గలికి చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్‌ను గుంతకల్లు రైల్వే పోలీసులు మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. ఓ ప్రయాణికుడికి సంబంధించిన విలువైన వస్తువులతో పాటు కొంత బంగారం రైలులో చోరీకి గురైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంతకల్లు రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీలతో పాటు చోరీ జరిగిన సమయంలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కొనసాగిన దర్యాప్తులో సదరు కానిస్టేబుల్ పాత్ర గుర్తించారు. ప్రాథమికంగా అనుమానితుడిగా భావిస్తూ బాధితుడికి సంబంధించిన సెల్‌ఫోన్‌ను ట్రాప్ చేయగా అది కానిస్టేబుల్‌కు చెందిన రహస్య స్థావరంలో లభ్యమైంది. అక్కడే మరికొన్ని బ్యాగ్‌లు కనిపించాయి. దీంతో పక్కాగా నిర్ధారణకు వచ్చిన రైల్వే పోలీసు అధికారులు ఎట్టకేలకు ఉన్నతాధికారుల అనుమతితో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

మరో ఖాకీ అండతో

రైలులో ప్రయాణికుల పర్యవేక్షణ విధుల్లో ఉండాల్సిన కానిస్టేబుల్ వారికి సంబంధించిన బ్యాగులను అపహరించి ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు అందజేసేవాడుగా రైల్వే పోలీసులు గుర్తించారు. ఆ బ్యాగులను భద్రంగా దాచి, అనంతరం చోరీ సొత్తును చెరీ సగం పంచుకునే వారు. ఏడాదిన్నర కాలంగా వీరిద్దరూ కలసి పదుల సంఖ్యలో చోరీలు చేసినట్లు సమాచారం. లక్షలాది రూపాయల విలువ చేసే ల్యాప్‌టాప్‌లు, ఐఫోన్‌లు, ట్యాబ్‌లు, బంగారు ఆభరణాలు రికవరీ అయ్యాయి. కాగా, వీరిద్దరి నుంచి తక్కువ ధరకు వచ్చిందని మరి కొందరు 14వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్లు బంగారం కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఫోన్‌లు, బంగారు నగలు, ట్యాబ్‌లు కొన్న వారంతా వీరిద్దరినీ అదుపులోకి తీసుకోవడంతో ఎవరికి వాళ్లు నీళ్లు నములుతున్నారు.

ఏసీ బోగీల్లోనే చోరీలు

రైలులో ఉన్నత వర్గాలు ప్రయాణించే ఏసీ బోగీల్లో పాగా వేసే బెటాలియన్ కానిస్టేబుల్ అత్యంత చాకచక్యంగా వారికి భద్రత కల్పిస్తున్నట్లు నటిస్తూనే ప్రయాణికులు నిద్రలోకి జారుకున్నాక చేతి వాటాన్ని ప్రదర్శించేవాడు. పోలీసు ఉన్నాడన్న నమ్మకంతో చాలా మంది ప్రశాంతంగా నిద్రపోతే తాను మాత్రం రూ.లక్షలు విలువైన ప్రయాణికుల సొత్తును కాజేసేవాడు. నేడో రేపో ఈ ఇద్దరు కానిస్టేబుళ్ల అక్రమాలను రైల్వే పోలీసులు బహిర్గతం చేయనున్నారు.

వైభవంగా శ్రీగిరి రథోత్సవం



పుట్టపర్తి రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సుందరంగా అలంకరించిన రథంపై సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని లాగుతూ ఊరేగింపుగా విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా తిరిగి ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఉత్సవంలో దేశవిదేశీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

శింగనమల: మండలంలోని గోవిందరాయునిపేటలో పట్టపగలే దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన రైతు గోగుల సంజప్ప తాను పండించిన బియ్యాన్ని అమ్మగా వచ్చిన రూ.5 లక్షలు ఇంట్లోని బీరువాలో ఉంచాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వచ్చిలోపు దుండగులు తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాలోని నగదు అపహరించుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. స్నిప్పర్ డాగ్ సాయంతో ఆధారాలు సేకరించారు.

బంగారు దుకాణాల్లో చోరీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని బంగారు దుకాణాల్లో చోరీ జరిగింది. దుకాణ యజమానులను ఏమార్చి బంగారం దొంగలించినట్లు బాధితులు తెలిపారు. సోమవారం గాంధీ చౌక్ వద్ద ఉన్న దుకాణంలో 10 గ్రాముల కమ్మలు దుండగులు అపహరించుకెళ్లారు. మరో దుకాణంలో మంగళవారం యజమానిని ఏమార్చి 40 గ్రాముల బంగారు నగలు చోరీ చేశారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా మహా చండీయాగం

అనంతపురం కల్చరల్: నగరంలోని రేణుకాయల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భారీ ఎత్తున మహా చండీయాగం జరిగింది. భవానీ మాలధారులు చెరుకూరి కృష్ణ ఆధ్వర్యంలో గోపూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించారు. మాజీ మేయర్ రాగే పరుశురామ్, కార్పొరేటర్ నాగమణి హాజరై మాట్లాడారు. లోక కల్యాణార్థం మహా చండీయాగం సాగడం ఆనందంగా ఉందన్నారు.

నేడు అయ్యప్ప పడిపూజ

ఆత్మకూరు: మండలంలోనితోపుదుర్తిలోని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాసంలో బుధవారం ఎమ్మెల్యే, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించనున్నారు. మంగళవారం పూజా కార్యక్రమానికి సంభందించి అన్ని ఏర్పాట్లును పూర్తి చేశారు.పడి పూజ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ ఆహ్వానితులే అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల నిరవధిక సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ నేత ఓబులు

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ నాయకులు నగర పాలక సంస్థ ముందు నిరవధిక సమ్మె మంగళవారం చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం, స్కిల్, సెమీ స్కిల్డ్ వేతనం, బకాయి ఉన్న డీఏ, ఇంక్రిమెంట్లను ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, నాయకులు నాగరాజు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ డీఈఓకు ఎమ్మెల్సీ పరామర్శ



సాయిరాంకు బొకే అందిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలో పూర్వ డీఈఓ ఎం.సాయిరామ్‌ను పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన నివాసానికి వెళ్లిన ఆయన.. పుష్ప గుచ్ఛం అందించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో కోలుకుని త్వరగా విధుల్లో చేరాలని ఆకాంక్షించారు. 'అపుస్మా' జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గాజుల చంద్ర, రాష్ట్ర నాయకులు రమణారెడ్డి ఉన్నారు.

పోలీసుల సమక్షంలో పోస్ట్‌మార్టం

గుంతకల్లు: రైల్వే రిటైర్డు ఉద్యోగి ఆసీఫ్‌ఉల్లా మృతదేహానికి పోలీసులు, కుటుంబ సభ్యుల సమక్షంలో పోస్ట్‌మార్టం చేసినట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆసీఫ్‌ఉల్లా మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులు ఈనెల 16న కర్ణాటకలోని బీజాపూర్ పోలీసుసేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం పాతబస్టాండ్ సమీపంలోని ఖబర్‌స్తాన్‌లో బీజాపూర్ సీఐతోపాటు తహసీల్దార్, టూటౌన్ సీఐ గణేష్ సమక్షంలో వైద్యులు ఆసీఫ్‌ఉల్లా మృతదేహాన్ని వెలికి తీసి పోస్ట్‌మార్టం చేశారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ద్విచక్రవాహనం పైనుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గొందిపల్లి గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి అనే వ్యక్తి గుత్తిలో పని నిమిత్తం బైక్‌పై బయలుదేరాడు. జక్కలచెరువు గ్రామ సమీపంలో వేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

గుంతకల్లు: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో బుధవారం సాయంత్రం 4 గంటల 5 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ నారాయణస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో ఏవైనా సమస్యలు, సలహాలు, సూచనలు ఉంటే 9959225855 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేడు వీరభద్రస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో బుధవారం వీరభద్రస్వామి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు.

ఆటల పండుగ ఆరంభం

రాప్తాడు రూరల్: గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'ఆడుదాం..ఆంధ్రా'కు శ్రీకారం చుట్టారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం చియ్యేడులో 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. చియ్యేడు, మన్నీల, పూలకుంట, ఉప్పరపల్లి, ఆకుతోటపల్లి, ఇటుకలపల్లి, కందుకూరు పంచాయతీల పరిధిలో పోటీలు జరగనున్నాయి. అనంతపురం రూరల్ మండలంలో 764 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొత్తం 794 టీంలు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో పాల్గొననున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 25 వేల మంది యువకులు క్రీడల్లో పాల్గొననున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతోనే మానసికంగా, ఆరోగ్యంగా ఉండొచ్చనే ఉద్దేశంతో క్రీడాపోటీలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం క్రికెట్, వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, యూత్ మండల కన్వీనర్ తాడిపత్రి శీనా, ఇటుకలపల్లి సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఉప్పరపల్లి శ్రీనివాసులు, పూలకుంట భాస్కర్ రెడ్డి, చియ్యేడు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సునీల్‌దత్తరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు అన్నారు. మంగళవారం ఎం.బండమీదపల్లి, గొల్లపల్లి, ప్రసన్నాయపల్లి, చిన్నయనగర్ గ్రామాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా పోటీలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ సాల్మన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల మండల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, సచివాలయ ఉద్యోగులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేసి క్రికెట్ మ్యాచ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఆడుదాం- ఆంధ్రా క్రీడలు అధికారులు,ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళవారం క్రీడలను ప్రారంభించారు. ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అధికారులు ఎంపీడీఓ రఘునాథ్, ఎంఈఓ రామాంజనేయుల ఆధ్వర్యంలో క్రీడలు ప్రారంభించారు. ఆత్మకూరు మండలంలోని 11 గ్రామ సచివాలయాలకు గాను ఆత్మకూరు క్రీడా మైదానంలో నాలుగు సచివాలయాలు, సనప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాలుగు సచివాలయాలు, తోపుదుర్తి, తలుపూరు, పి.యాలేరు గ్రామ సచివాలయాలకు గాను ఆయా గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రాను పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్‌కుమార్, పంపనూరు సర్పంచు ఎర్రిస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, అతిక్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ వెంకటేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, అశోక్, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర వినూత్న ప్రదర్శన

ఆత్మకూరు: రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కేజీబీవీలోని విద్యార్థినులు ఆంధ్రాను అక్షరాల రూపంలో కూర్చొని, వినూత్నంగా ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ లీమారోజ్ విద్యార్థినులతోకార్యక్రమం నిర్వహించారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభం

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మంగళవారం ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. కనగానపల్లి మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పోటీలను ప్రారంభించారు. మండల కేంద్రంలో ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో పోటీలు ప్రారంభించారు. మండలంలోని మామిళ్లపల్లి, తగరకుంట, మద్దెలచెరువు సచివాలయా పరిధిలోనూ ప్రజాప్రతినిధులు ఆటల పోటీలు ప్రారంభించారు.ఎంపీడీఓ అలివేలమ్మ, ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, నాయకులు నాగముని, భాస్కర్, అశోక్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సర్పంచులు ఓబిరెడ్డి, నారాయణ, పలు పాఠ శాలల పీడీలు, పీఈటీలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి పెంచేలా ఆడుదాం..ఆంధ్ర

చెన్నేకొత్తపల్లి: యువతకు క్రీడా స్ఫూర్తి పెంచేలా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో వారు మంగళవారం ఆడుదాం.. ఆంధ్ర పోటీలను ప్రారంభించారు. తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ గంగావతి, సర్పంచ్ ధనశ్రీ, మండల కన్వీనర్ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఆరంభం అదిరింది

- అనంతపురం పీటీసీలో ఆడుదాం ఆంధ్రా పోటీల ఆరంభం అదిరింది. కలెక్టర్, ప్రజాప్రతినిధులు పాల్గొని మ్యాచ్‌లు ప్రారంభించారు. క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. టోర్నీ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత,తదితరులు



బాలికల సాంస్కృతిక ప్రదర్శన



వాలీబాల్ పోటీలో తలపడిన సచివాలయాల క్రీడాకారులు



సన్‌రే - హైదర్‌వలి కాలనీ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్



రాప్తాడులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీటీసీ సభ్యురాలు హేమావతి



ఆత్మకూరు కేజీబీవీలో ఆడుదాం ఆంధ్ర అంటూ అక్షర రూపంలో కూర్చున్న విద్యార్థినులు



ఆత్మకూరులో క్రీడాకారులకు కిట్లు అందిస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు



పోటీలను చూసేందుకు వచ్చిన విద్యార్థులు

సామాజిక సాధికార యాత్రకు ఏర్పాట్లు

అనంతపురం కార్పొరేషన్: సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం చేయడానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. బస్సుయాత్ర జరిగే పాతూరు గాంధీ విగ్రహం (తాడిపత్రి బస్టాండ్) ప్రాంతాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ నెల 29న సామాజిక సాధికార బస్సు యాత్ర జరుగుతున్న విషయం విదితమే. సభాస్థలి ఎటువైపు ఉండాలి.. వేలాది మంది ప్రజలు తరలివచ్చినా ఎలాంటి సమస్య లేకుండా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ శ్రేణులు , వన్‌టౌన్, ట్రాఫిక్ పోలీసులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మేయర్ వసీం , డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డిలున్నారు.



తాడిపత్రి బస్టాండ్‌లో బస్సు యాత్ర స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత, నాయకులు

కుష్టు సామాజిక సమస్య

గుత్తి రూరల్: కుష్టును సామాజిక సమస్యగా చూడాలని డీపీఎంఓ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మాముడూరులో గ్రామస్తులకు కుష్టుపై బేతాపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం డీపీఎంఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ సుధారాణి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరి పాత్ర ఉంటేనే కుష్టును రూపుమాపవచ్చన్నారు. బాధితులను ఆదరించాలన్నారు. వైద్య సిబ్బంది లాజరస్, ఆంజనేయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాముడూరులో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాలు ఎంతో అవసరమని ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. మంగళవారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం వారు ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా బీటెక్ సెకండియర్ విద్యార్థులకు గేమ్ డిజైన్ యూజింగ్ బిల్డ్ బాక్స్‌పై స్కిల్ ఒరియెంటెడ్ కోర్సు–1పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ చదువుతలో పాటు టెక్నాలజీపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. బిల్డ్ బాక్స్ అంటే సాంకేతిక నైపుణ్యంతో సంబంధం లేకుండా ఎవరైనా అద్భుతమైన గేమ్‌లను సృష్టించడానికి ఉపయోగించే సాఫ్ట్‌వేర్ అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, వీర ప్రకాష్, షాజాహాన్, విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

జగనన్నను మరోమారు ఆశీర్వదించండి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: పార్టీలు, కులాలు, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఏకైక ప్రభుత్వమని, అర్హత ఉంటే చాలు ఇంటివద్దకే పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అన్నారు. ప్రతి మహిళనూ లక్షాధికారిణి చేయాలనే లక్ష్యంగా జగనన్న అడుగులు వేస్తున్నారన్నారన్నారు. అన్ని వర్గాలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పని చేస్తున్నారని అన్నారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ ఎస్ఆర్ కాలనీలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని తెలియజేస్తూ లబ్ధి పత్రాలను మహిళలకు ఎమ్మెల్యే అందించారు. ప్రభుత్వం చేస్తున్న మేలును తెలియజేస్తూ, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం ఎస్ఆర్ కాలనీ నుంచి అక్కంపల్లి వరకు నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.పుష్పావతి, ఎంపీటీసీ సభ్యుడు సంజీవరాయుడు, ఎంపీపీ వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, పార్టీ మండల కన్వీనర్ కె.రాధమ్మ, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, నాయకులు మాధవరెడ్డి, వడ్డే శీనా, డాక్టర్ శీనా, చంద్రారెడ్డి, లింగమయ్య, వడ్డే పెద్దన్న, ఈశ్వరయ్య, కాటమయ్య, గోవిందరాజులు, రమణ, లింగన్న, ధనుంజయ, రవికుమార్, అంజి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

అనంతపురం కార్పొరేషన్: సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నే సీఎం కావాలని, రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీను ఆశీర్వదించాలని మాజీ మేయర్ రాగే పరుశురాం పేర్కొన్నారు. మంగళవారం 7వ డివిజన్ 10 సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. మాజీ మేయర్ రాగే పరుశురాం సంక్షేమ, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. మాజీ మేయర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల కంటే భిన్నంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహకందని సంక్షేమం, పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతోందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.వందల కోట్లతో నగరం రూపురేఖలు మారిపోయాయన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం, సీఎం ప్రత్యేక నిధులు, 15వ ఆర్థిక సంఘం, నగరపాలక సంస్థ సాధారణ నిధులతో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బండి నాగమణి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి , క్లస్టర్ అధ్యక్షుడు రమణారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు రాధాయాదవ్, డివిజన్ కన్వీనర్లు నజీర్, వెంకటరాముడు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు బ్రోచర్లు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మేయర్ రాగే పరుశురాం

'మేము సమ్మెలోకి వెళ్లలేదు '

రాప్తాడు: మేము సమ్మెలోకి వెల్లలేదని, ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు వెళ్లి విధులు నిర్వహించామని వలంటీర్లు వాల్మీకి నరేష్, విష్ణువర్ధన్ రెడ్డి, జయశ్రీ, శివ లక్ష్మీ, నరేష్, బుల్లే లావణ్య, బుడగల ఉమాదేవి, మహేశ్వరి, అనిల్ కుమార్, మమత, కదిరయ్య, తలారి మారుతి, అనిల్ కుమార్, వరలక్ష్మీ, రాధిక, భారతి, ఓం ప్రకాష్, పరిమళ, భార్గవి, శైలజ, ముత్యాలు, చంద్రశేఖర్, హరి, శారద, పార్వతి తదితరులు తెలిపారు. మంగళవారం నుంచి వలంటీర్లు సమ్మె అనే వార్త కథనాన్ని ఈనాడులో ప్రచురితమైంది. స్పందించిన వలంటీర్లు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. అధికారులు వారికి చెప్పిన విధులను యధావిధిగా చేశారు. మండల వ్యాప్తంగా 208 మంది వలంటీర్లు పనిచేస్తున్నారని, దాదాపుగా 200 మంది వలంటీర్లు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు.



రాప్తాడు ఎల్లార్జీ పాఠశాలలో జరిగిన పోటీల్లో విధుల్లో పాల్గొన్న వలంటీర్లు

నేత్రపర్వంగా నారాయణుడి కల్యాణం

పెద్దపప్పూరు: ధనుర్మాసం పౌర్ణమి సందర్భంగా అశ్వర్థనారాయణ స్వామి క్షేత్రంలో మంగళవారం స్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా సాగింది. నారాయణ స్వామి, శ్రీదేవి,భూదేవి ఉత్సవ మూర్తులను వధూవరులుగా పట్టువస్త్రాలతో అలకంరించి కల్యాణ తంతు జరిపించారు. అనంతరం స్వాముల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. యాడికి మండలం వెంగన్నపల్లికి చెందిన మహిళా భజన బృందం భక్తికీతాలు ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ జయంతి



పాతూరులో ఉన్న దత్త మందిరంలో దత్తాత్రేయుడికి పూజలు నిర్వహించిన దృశ్యం



దత్తాత్రేయ దేవాలయంలో హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు



పూజలు అందుకున్న దత్తాత్రేయ స్వామి

అనంతపురం కల్చరల్: దత్తాత్రేయస్వామి జయంతి మంగళవారం పలు చోట్ల వైభవంగా జరిగింది. పాతూరులోని దత్తాత్రేయాలయంలో ఉదయం నుంచే దత్తదేవుడికి విశేష కవచాలంకారం, దత్త నామకరణ, బ్రహ్మోపదేశాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రతినిధి అప్పా సుధీర్ నేతృత్వంలో శ్రీదత్తభిక్ష, పూర్ణాహుతితో రెండు రోజుల పాటు సాగిన దత్త ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ నిర్వాహకులు సత్యప్రసాద్ తెలిపారు. ప్రశాంతినగర్‌లోని ఔదంబర వృక్షం వద్ద నిర్వాహకులు శారదామౌళి ఆధ్వర్యంలో దత్త జయంతి వేడుకలు నిర్వహించారు. సాయిట్రస్టు ఆధ్వర్యంలో తపోవనంలోని శివసాయిమందిరం, హెచ్చెల్సీ కాలనీలోని శ్రీవలీ స్వామి ఆశ్రమంలో దత్తజయంతి వేడుకలు నిర్వహించారు. జెడ్పీకార్యాలయం ముందున్న జ్ఞానసాగర దత్తాత్రేయ దేవస్థానంలో దత్తహోమం, సాయంత్రం శోభాయాత్ర కనులపండువగా జరిగాయి.

అనంతపురం కల్చరల్: మార్గశిర పౌర్ణమి వేడుకలు మంగళవారం కనులపండువగా జరిగాయి. నగరంలోని నాల్గోరోడ్డులో కొలువైన సీతారామాంజనేయ సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. నగరంలోని మొదటిరోడ్డు ప్రాచీన దేవాలయమైన రాఘవేంద్రస్వామి సన్నిధిలో మంగళవారం రాత్రి రథోత్సవ వేడుకలు కనులపండువగా జరిగాయి.